# పైట పదిలం అమ్మడూ...

పేరంటం అంటే ఆడాళ్ళ ఫేషన్ షోలా వుంటుంది....

తమకున్న మంచి చీరకు, నగలూ, మేకప్ జోడించి ప్రత్యేకమైన అలంకరణ చేసుకుంటారు. ముఖ్య విశేషమేమిటంటే 'ఆమెకన్నా నేను బాగా తయారవ్వాలి! ఆమె చీర కన్నా నేను మంచి చీర కట్టుకోవాలి!! అప్పుడు ఆమె నన్ను చూసి ఏడవాలి!' ఇలా వుంటుంది వరస.

ఒక్కోసారి పేరంటానికి తమ ఇంటిముందు నుండి వెళ్ళే వారందరి చీరలూ, అలంకరణా చూసి కూడా ఆడాళ్ళు తయారవుతూ వుంటారు.

ఇంతకీ విషయమేమంటే—

ఆ కాలనీలో సుబ్బారావుగారింట్లో పేరంటం. వాళ్ళ ముద్దుల కొడుకు, ఒక్కగానొక్క కొడుకు రెండో పుట్టిన రోజు.

ఆ కాలనీలో ఆయనది పెద్ద ఉద్యోగం కాకపోయినా మాంచి పలుకుబడి వున్నవాడు.

అదేం ఖర్మో ఆయన ఇంటికి వెళ్ళే వాళ్ళంతా పైట నిండుగా కప్పుకుని వెళ్తారు.

అర్థం లేకుండా—

ఒక రమణి సిల్క్ బ్రీజ్ చీర కట్టింది.

ఇంకో వయ్యారి గార్డెన్ సిల్క్ చీర చుట్టబెట్టుకుంది.

మరొక లలన మోంగా సిల్క్ కట్టుకుంది.

మరో సుందరి కరిష్మా కట్టుకుంది.

కాని—

వీళ్ళందరూ పైట చెంగు నిండుగా కప్పుకుని వెళ్తున్నారు.

ఆ కాలనీకి కొత్తగా వచ్చిన రమ 'ఏమిటి వీళ్ళంతా చక్కని చీరలు కట్టుకుని ముసలాళ్ళలా పైట నిండుగా కప్పుకుని వెళ్ళుతున్నారు. చక్కగా పేరంటానికి షోగ్గా వెళ్ళకుండా!' అనుకుంటూంది.

రమ వైట్ విమల్ షైనింగ్ డోరియా చీర కట్టుకుంది.

అజంతా శిల్పంలా, ఏ కోణంలోంచి చూసినా మగాడు ఆమె నుంచి చూపులు మరల్చుకోలేనంత అపురూప శిల్పంలా వుందామె.

వయ్యారంగా తయారై బ్రాలెస్ జాకెట్ వేసుకుని వయసు వంపు సొంపుల ప్రదర్శనతో బయలుదేరింది.

ఆమెను చూడటానికి రెండు కళ్ళు చాలవు అన్నట్టుగా వుంది.

రమ తిప్పుకుంటూ వెళ్తుంటే ఎదురింటామె, ప్రక్కింటామె రమను చూసి "పైట నిండుగా కప్పుకోండి. వాళ్ళింటికి వెళ్ళాలంటే మాకు చచ్చే సిగ్గు బాబూ" అంది.

రమ ఆశ్చర్యపోయింది.

"అదేంటండీ ఆ అబ్బాయి తండ్రి మంచివాడు కాదా? ఆడాళ్ళ జాకెట్లు చూస్తాడా, లేక ఆడాళ్ళని ఎక్స్‌రే కళ్ళతో చూస్తాడా?"

"అదేం కాదు లెండి. మీ ఇష్టం. మేము చెప్పాము, మీ కోసమని"

"చూద్దాం ఏం జరుగుతుందో. నాకు ఆలా ముసలాళ్ళలా చెంగు కప్పుకోడం అంటే చిరాకు" అంది రమ.

దారిలో మిగతా ఆడాళ్ళు కూడా రమను పైట నిండుగా కప్పుకోమని సలహా ఇచ్చారు.

అయినా రమ వినలేదు.

సుబ్బారావుగారింటికి చేరారు అందరూ.

క్వార్టర్స్ ముందు డెకరేషన్ బల్బ్స్ పెట్టారు.

చాలా హంగామాగా వుంది.

వాళ్ళ బాబు ముద్దులు మూటకడుతున్నాడు. వాళ్ళమ్మ చంకలో వున్నాడు.

"చ్ఛీ చ్ఛీ" అందరూ వాడ్ని పలకరిస్తున్నారు.

వాడు ఈ సందడికి ఏడుస్తుంటే వాళ్ళమ్మ వాడ్ని పక్కన వున్న ముసలావిడకు ఇచ్చింది.

ఈలోగా ఆడాళ్ళు వస్తున్నారు.

ఆ చిన్న వెధవ

ఆడాళ్ళందర్ని నిశితంగా చూస్తున్నాడు.

రమ అందరితో బాటుగా వాడి దగ్గరకు వెళ్ళింది.

"బాబూ. ఇదిగో తీసుకో" అని డాన్సింగ్ డాల్ ఇవ్వబోయింది. అంతే వాడు—

"అమ్మా పాలే" అంటూ రమ మీదకు దూకి ఆమె బ్రాలెస్ జాకెట్ మీద నుంచి నోరు పెట్టేసి జాకెట్ మీద నుంచే పాలు తాగుతున్నట్లుగా చీకడం మొదలుపెట్టాడు. ఏం జరుగుతోందో తెలుసుకునే లోపుగా రమ జాకెట్ తడిసింది.

"అరే వెధవాయ్ తప్పు కదూ" అంటూ వాడి తల్లి వచ్చింది.

"సారీ అండీ. మా వాడికి పాలు మాన్పిద్దామని ఎంత ప్రయత్నించినా కుదరడంలేదు. ఎవరైనా సరే – జాకెట్ కనుపిస్తే చాలు వెళ్ళిపోయి పాలు తాగేస్తాడు" అందామె.

ఒక వేపు తడిసిపోయిన జాకెట్‌ని చూసుకుంటోంది రమ.

అప్పుడుగాని రమకు అందరూ ఎందుకు పైట కప్పుకుంటున్నారో అర్థంకాలేదు. "ఎందుకయినా మంచిది పదిమంది నడిచినట్టుగానే నడవటం మంచిది" అనుకుంది అప్పుడు, కాని ఏం లాభం!

—o—